నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, బుధవారం 21 మే 2025 | MEDAK

# కేసీఆర్ పాలన కోరుకుంటున్న ప్రజలు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, మే 20: మళ్లీ కేసీఆర్ రావాలి.. తెలంగాణకు పూర్వవైభవం తేవాలని యావత్ తెలంగాణ ప్రజానీకం ఎదురుచూస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఏదో మార్పు తెస్తారని కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే, రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిలో వెనక్కినెట్టి దివాలా తీయిస్తున్నాడని విమర్శించారు. మండలంలోని నాగరాజుపల్లిలో రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన మంగళవారం నిర్వహించిన కల్యాణోత్సవం హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో రైతుబంధు పైసలు ఠంఛన్ వేశారని, కాంగ్రెస్ పాలనలో అంతా సగం సగం రైతుబంధు పడుతున్నదని విమర్శించారు. ఈ సమయంలో రైతులకు అందాల్సిన పచ్చిరొట్టె ఎరువులు, జనుము, జీలుగ విత్తనాలు ఇంత వరకు దిక్కులేవని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడమే కాకుండా దుక్కి దున్నే సమయానికి రైతుబంధు ఇచ్చినట్లు గుర్తుచేశారు. అందాల పోటీలు నిర్వహించడం మీద ఉన్న సోయి ఈ ప్రభుత్వానికి రైతుల సంక్షేమం మీద లేదని హరీశ్‌రావు విమర్శించారు.

# అభివృద్ధికి ఆదర్శం సిద్దిపేట

- చినజీయర్ స్వామి


సిద్దిపేటలో చినజీయర్ స్వామికి పాదపూజ చేస్తున్న హరీశ్‌రావు దంపతులు


క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు, సిద్దిపేట నాయకులతో ముచ్చటిస్తున్న చినజీయర్ స్వామి

సిద్దిపేట, మే 20: సిద్దిపేట అంటే ఆదర్శం, అభివృద్ధి, అవార్డులకు చిరునామా అని, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు లాంటి నాయకుడు ఉండడం సిద్దిపేట ప్రజల అదృష్టమని చిన జీయర్ స్వామి అన్నారు. సిద్దిపేటలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడానికి మంగళవారం చినజీయర్ స్వామి వచ్చారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనకు హరీశ్‌రావు-శ్రీనిత దంపతులు పాద పూజ నిర్వహించారు. పాదపూజ అనంతరం చినజీయర్ స్వామి ఎమ్మెల్యే హరీశ్‌రావుతో పాటు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆశీస్సులు అందజేశారు. క్యాంపు కార్యాలయం నుంచి తిరిగి వెళ్లేటప్పుడు అక్కడి వారితో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. హరీశ్‌రావు సిద్దిపేటను ఎంతో అభివృద్ధి చేశారని, సిద్దిపేట పేరు లేకుండా ఏ అవార్డుల కార్యక్రమం ఉండదని, ఎన్నో అవార్డులు వచ్చాయని, దీనంతటికి ఎమ్మెల్యే హరీశ్‌రావు పనితీరు, పట్టుదల కారణం అని చిన జీయర్ స్వామి అన్నారు.

# కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి సాయిరమాదేవి

- సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి

సిద్దిపేట టౌన్, మే 20: జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో కేసులు పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ చూపాలని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి పిలుపునిచ్చారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 9నుంచి 14వరకు జరిగే జాతీయ లోక్ అదాలత్ సన్నాహక సమావేశం మంగళవారం సిద్దిపేట కోర్టు ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. జిల్లాలో సివిల్, క్రిమినల్, ఎక్సైజ్, మోటర్ వాహనాల కేసులు అధిక సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. లోక్ అదాలత్‌లో అన్నిరకాల రాజీమార్గం ద్వారా రాజీకుదుర్చుకొని ఉపశమనం పొందాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పెద్దఎత్తున కేసులను పరిష్కరించాలన్నారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్జిలు మిలింద్‌కాంబ్లే, సంతోష్‌కుమార్, తరణి, పీపీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 22న మంజీరా రచయితల సంఘం సదస్సు


సిద్దిపేటలో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, మే 20: 'అందాల పోటీలు.. వ్యాపార సంస్కృతి' అనే అంశంపై మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22న హైదరాబాద్‌లో సామాజిక సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు రంగాచారి తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సదస్సు కరపత్రాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగాచారి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగే ఈ సదస్సుకు ప్రముఖ కవయిత్రి విమల ప్రధాన వక్తగా హాజరై ప్రసంగిస్తారన్నారు. ఆత్మీయ అతిథిగా ప్రఖ్యాత కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందినీ సిధారెడ్డి హాజరవుతారన్నారు. అందాల పోటీలు ఈతరం సమాజానికి ఉపయోగపడేవి కావని, మహిళలను వ్యాపార వస్తువుగా చేయడం కోసం మాత్రమే అందాల పోటీలని విమర్శించారు. మంజీరా రచయితల సంఘం అందాల పోటీలకు వ్యతిరేకమన్నారు. సదస్సుకు జిల్లా నుంచి కవులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు యాదగిరి, అశోక్, బాలయ్య, కిషన్, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

# వీ హబ్‌తో గీతం అవగాహన ఒప్పందం


ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న ప్రతినిధులు

పటాన్‌చెరు రూరల్, మే 20: తెలంగాణ ప్రభుత్వం మహిళా వ్యవస్థాపకుల కోసం నెలకొల్పిన వీహబ్‌తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ర్యాంప్-సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల పనితీరును పెంచి వాటిని వేగవంతం చేసేందుకు మంగళవారం ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నారు. మహిళలు నడిపే సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమలను ముందుకు తీసుకెళ్లడానికి ఈ ఒప్పందం ఉపకరిస్తుంది. మహిళా వ్యవస్థాపకులకు వారి యూనిట్లను వృద్ధి చేసుకోవడానికి అవసరమైన వనరులు, మార్గదర్శనం, అందుకు అనుగుణంగా వాతావరణాన్ని పెంపొందిస్తారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్ ఆవిష్కరణ, వ్యవస్థాపక కేంద్రమైన వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ దీనిని నిర్వహించనున్నది. ఈ అవగాహనా ఒప్పందంపై గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ దివ్యకృతి గుప్తా, వీహబ్ డైరెక్టర్ జాహిద్ అక్తర్ షేక్ సంతకాలు చేశారు. వీడీసీ డిప్యూటీ డైరెక్టర్ ఫక్రుద్దీన్ షేక్ ఈ కార్యక్రమాన్ని అమలు చేయడంలో కీలక కార్యాచరణ పోషించడమే గాక, వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థలను పెంపొందించడంలో గీతం చురుకైన పాత్రను పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో వీహబ్ సీఈవో పి.సీత, వీడీసీ కోచ్‌లు, ఈ-క్లబ్ సభ్యులు, అధ్యాపకులు, విభాగాధిపతులు, బీబీఏ విద్యార్థి వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్వీఎం దవాఖానలో అరుదైన శస్త్రచికిత్స


శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

ములుగు, మే 20: ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం దవాఖానలో అరుదైన శస్త్రచికిత్స చేసి రోగి అన్నవాహికలో ఇరుక్కున్న ఎముకను వైద్యులు తొలిగించారు. మంగళవారం వైద్యులు మీడియాకు వివరాలను వెల్లడించారు. జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాలకు చెందిన యాదగిరి భోజనం చేస్తూ అనుకోకుండా ఎముకను మింగడంతో అతడి అన్నవాహికలో ఇరుక్కుపోయింది. అన్నవాహికలోని చాలా భాగాలను ఎముక కత్తిరించినట్లుగా వైద్యులు గుర్తించారు. దీంతో రోగికి శ్వాస సంబంధిత, జీర్ణక్రియ సమస్యలు తలెత్తడంతో ఆర్వీఎం దవాఖానలో చేరారు. గ్యాస్ట్రోస్కోపీ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి అన్నవాహికలో ఎముక ఇరుక్కున్నట్లు గుర్తించి ఓ విస్కో ద్వారా ఎముకను తొలిగించినట్లు వైద్యులు తెలిపారు. తమ దవాఖానలో లాభాపేక్ష లేకుండా రోగులకు వైద్యసేవలు అందించినట్లు దవాఖాన చైర్మన్ డాక్టర్ యాకయ్య, సీఈవో శ్రీనివాస్‌రావు తెలిపారు. సుమారు రూ.15 లక్షల విలువైన ఈ చికిత్సను ఉచితంగా అందించినట్లు వారు తెలిపారు.

# మా అడ్రస్ ఎక్కడ!

## ప్రశ్నార్థకంగా మారిన ముంపు గ్రామాలు.. కాలనీని పట్టించుకోని అధికారులు

- ఆర్‌అండ్‌ఆర్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే
- తొగుట, కొండపాక మండలాల నుంచి వేరుచేసిన అధికారులు
- గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనం మరిచారు..


గజ్వేల్‌లో మల్లన్నసాగర్ సాగర్ నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ కాలనీ

గజ్వేల్, మే 20: మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన 14 గ్రామాల ప్రజలకు గజ్వేల్ సమీపంలోని సంగాపూర్-ముట్రాజ్‌పల్లి గ్రామాల మధ్య 600ఎకరాల విస్తీర్ణంలో సుమారు 2273 డబుల్ బెడ్‌రూం ఇండ్లను బీఆర్ఎస్ హయాంలో నిర్మించి ఆయా గ్రామాల బాధిత కుటుంబాలకు అందజేశారు. మరికొద్ది మందికి ఓపెన్ ప్లాట్లు ఇచ్చారు. గతేడాది సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ఆయా గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియామించారు. కొద్ది రోజుల వరకు ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలోనే గ్రామాల్లో పారిశుధ్య, తదితర పనులు చేపట్టారు. కొద్ది రోజుల క్రితం ముంపు గ్రామాలను తొగుట, కొండపాక మండలాల నుంచి వేరుచేసిన అధికారులు, గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనం చేయకపోవడంతో ప్రస్తుతం తమ అడ్రస్ ఎక్కడ అంటూ ముంపు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### అటు ఇటు కాకుండా..

ముంపు గ్రామాలను తొగుట, కొండపాక మండలాల నుంచి తొలిగించిన అధికారులు ఆయా గ్రామాలను అధికారికంగా ఎక్కడ చూపించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తమ అడ్రస్ ఎక్కడ అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ముంపు గ్రామాలను కలుపుతున్నట్లు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో ముంపు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముంపు గ్రామాల్లో పనిచేసిన పంచాయతీ అధికారులను ఇతర మండలాలకు బదిలీ చేశారు. దీంతో ఆయా గ్రామాల పర్యవేక్షణ గాలిలో దీపంలా మారింది. అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్యలను పరిష్కరించే వారు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఐదు నెలలుగా పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఎలాంటి వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. అటు తొగుట, కొండపాక మండలాల్లో కాకుండా, ఇటు గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనం చేయలేదు.

### బీఆర్ఎస్ హయాంలో పునరావాసం

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ఏటిగడ్డ కిష్టాపూర్‌లో 1253, లక్ష్మాపూర్‌లో 388, వేములఘాట్‌లో 1252, పల్లెపహాడ్‌లో 921, రాంపూర్‌లో 320, బ్రాహ్మణ బంజేరుపల్లిలో 267, ఎర్రవల్లిలో 800, సింగారంలో 330కి పైగా ముంపు కుటుంబాలు ఉండగా, వీరి కోసం 2273 డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేసీఆర్ ప్రభుత్వం నిర్మించి ఇచ్చింది. ఆయా గ్రామాల్లో వ్యవసాయ భూమితో పాటు ఇతర ఆస్తులకు పరిహారం ఇవ్వడం, ప్రతి కుటుంబానికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.7.50 లక్షలు, ఇల్లు అందజేశారు. ఇల్లు వద్దనుకున్న వాళ్లకు ఓపెన్‌ప్లాట్‌తో పాటు రూ.5.04లక్షలు అందజేశారు. 18 ఏండ్లు నిండిన మగవారికి ఓపెన్ ప్లాట్, అమ్మాయిలకు పరిహారం చెక్కులు అందజేశారు.

### ఎక్కడి సమస్యలు అక్కడే..

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నెలకొన్న చిన్నపాటి సమస్యలను కూడా పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లా అధికారులు కాలనీలో పర్యటించిన సందర్భంలో అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని సమాధానం చెప్పి ఆ తర్వాత కాలయాపన చేస్తున్నారు. కాలనీలోని డ్రైనేజీలపై స్లాబ్‌లు విరిగిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారాయి. డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో మట్టితో నిండిపోయాయి. కాలనీలో మిగిలిన కొద్దిపాటి మందికి ప్యాకేజీ, ప్లాట్లను ఇవ్వడంతో పాటు ముంపు గ్రామాల కోసం తక్షణమే శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పల్లెపహాడ్‌లో విరిగిన మురుగుకాల్వ స్లాబ్

# సీఎం పర్యటనకు ఏర్పాట్లు


హెలిప్యాడ్ స్థలంలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసు సిబ్బంది


జహీరాబాద్, మే 20 : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ఝరాసంగంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన కోసం ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈనెల 23న జహీరాబాద్ పర్యటనలో భాగంగా ఝరాసంగం మండలంలోని నిమ్జ్ ప్రాజెక్టు ప్రత్యేక రోడ్డుతో పాటు జహీరాబాద్ పట్టణ సమీపంలోని హుగ్గెలి చౌరస్తాలో బసవేశ్వర విగ్రహావిష్కరణ, జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా సమీపంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, మహీంద్రా అండ్ మహీంద్రా పరిశ్రమలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ప్లాంట్‌కు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. జహీరాబాద్‌లోసీఎం పర్యటన విజయవంతానికి సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పనులు పర్యవేక్షిస్తున్నారు. సీఎం చేతుల మీదుగా చేపట్టనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసే ప్రదేశాల్లో రోడ్లకు కలరింగ్‌తో పాటు అల్గోల్ చౌరస్తాలో హెలిప్యాడ్, బహిరంగ సభ స్థల పరిసరాల్లో ముళ్లపొదలు, చెత్తా చెదారాన్ని జేసీబీలతో తొలిగించి శుభ్రం చేస్తున్నారు. పోలీసులు హెలిప్యాడ్, బహిరంగ సభ జరిగే ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నారు.

### ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

ఈనెల 23న సీఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్ పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటించే రూట్ మ్యాప్‌లో భాగంగా హెలిప్యాడ్, బహిరంగ సభ వేదిక, నిమ్జ్ ప్రత్యేక రోడ్డు, రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పరిసరా ప్రాంతాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. స్థానిక పోలీసు అధికారులు, ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ సంజీవ్‌రావు, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, పట్టణ, రూరల్ సీఐ శివలింగం, హనుమంతు, ఎస్సైలు కాశీనాథ్, ప్రభాకర్‌రావు తదితరులు ఉన్నారు.

# సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహ


మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి కలెక్టరేట్, మే 20: సంగారెడ్డి జిల్లాలో ఈనెల 23న సీఎం రేవంత్ పర్యటిస్తారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సీఎం పర్యటనపై మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. జహీరాబాద్‌లో సీఎం బసవేశ్వర విగ్రహావిష్కరణ, కేంద్రీయ విద్యాలయ నూతన భవన ప్రారంభోత్సవం, మహిళా పెట్రోల్ బంక్, మరిన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని, అనంతరం వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి సభలో పాల్గొంటారని మంత్రి తెలిపారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని మంత్రి ఆదేశించారు.


జైపాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

## పలువురికి హరీశ్‌రావు పరామర్శ

సిద్దిపేట కమాన్, మే 20: సిద్దిపేట పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాయిని జైపాల్‌రెడ్డికి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు మంగళవారం జైపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఇర్కోడ్ దర్గా ముత్తావలి కొడుకు ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిద్దిపేట పట్టణ ఎలక్ట్రిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. హరీశ్‌రావు వెంట మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# జూన్ 2 నుంచి భూభారతి అమలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హుస్నాబాద్ టౌన్, మే 20: రాష్ట్రవ్యాప్తంగా జూన్ 2వ తేదీ నుంచి భూభారతి చట్టాన్ని అమలు చేయడంలో భాగంగా అన్ని రెవెన్యూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించే కార్యక్రమాన్ని చేపడతామని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లో నిర్వహించే భూభారతి సదస్సులో పాల్గొనేందుకు మంగళవారం మధ్యాహ్నం హెలిక్యాప్టర్‌లో ఆయన హుస్నాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. భూభారతి చట్టం అమలు చేయడం, సమస్యలను పరిష్కరించే కార్యక్రమంలో తహసీల్దార్ స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఆగస్టు 15వ తేదీలోగా వీలైనన్ని జఠిలమైన సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లైసెన్సు సర్వేయర్లు 6వేల మందిని ఈనెల 27వ తేదీ వరకు ఫైనల్ చేసి, మూడు నెలల శిక్షణ ఇచ్చి ప్రతి మండలానికి 8మంది చొప్పున నియమిస్తామని అన్నారు. అంతకుముందు మంత్రి శ్రీనివాసరెడ్డికి రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, కలెక్టర్ మనుచౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, శివయ్య, ముత్యాల సంజీవరెడ్డి స్వాగతం పలికారు.

# కోట్లు వెచ్చించినా..!

## నాసిరకంగా హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనులు

- బస్టాండ్ అంతా లీకేజీలు
- ఆవరణ అంతా నిలుస్తున్న వరద
- మూతపడ్డ మూత్రశాలలు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు


ఆధునీకరణ సరే.. ఈ వరదనీరు సంగతేందీ... హుస్నాబాద్ బస్టాండ్‌లో నిలిచిన వరద నీరు


మూడు వారాలుగా హుస్నాబాద్ బస్టాండ్‌లో మూతపడ్డ టాయిలెట్స్

హుస్నాబాద్ టౌన్, మే 20: హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనులు నాసిరకంగా చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆధునీకరణ పనులు నాణ్యతతో చేపట్టలేదని, దీంతో చిరుజల్లులకే బస్టాండ్‌లో లీకేజీలు ఏర్పడుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హుస్నాబాద్ బస్టాండ్ నిర్మాణ సమయంలో తూర్పువైపు మూత్రశాలలు నిర్మించారు. ఇటీవల ఆధునీకరణలో భాగంగా పడమరలో నూతనంగా మూత్రశాలలు నిర్మించారు. తూర్పువైపు నిర్మించిన మూత్రశాలలు మూడు వారాలుగా మరమ్మతుల పేరుతో మూసివేశారు. దీంతో ప్రయాణికులు మూత్ర విసర్జనకు ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా నిర్మించిన మూత్రశాలల ప్రాంతంలో కట్టిన మెట్లను ఎక్కలేక వృద్ధులు, మహిళలు ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు.

### చిరుజల్లులతో లీకేజీలు...

హుస్నాబాద్ ఆర్టీస్ బస్టాండ్‌ను ఇటీవల రూ.2.50 కోట్లతో ఆధునీకరించారు. బస్టాండ్ చుట్టూ ఫెన్సింగ్, గ్రానైట్‌తో కొత్త ప్లాట్‌ఫాంలు, టాయిలెట్స్, పూర్తిస్థాయిలో సీసీ, గార్డెన్ తదితర పనులు చేపట్టారు. కోట్లరూపాయలతో పనులు చేపట్టినప్పటికీ చిరుజల్లులకే భవనం లీకేజీలు అవుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ ఆవరణలో నిలిచే వరద నీరు బయటకు వెళ్లేందుకు పైపులైన్ నిర్మాణం చేపట్టకుండా హడావిడిగా పనులు పూర్తిచేశారనే విమర్శలు ఉన్నాయి. దీంతో వాన కురిస్తే బస్టాండ్ పరిసరాలు వరదతో నిండిపోతున్నది. వర్షం నీరు బయటకు వెళ్లేందుకు పైపులైన్ నిర్మాణం, ఛాంబర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఏర్పాటు చేయకపోవడంతో వరద బస్టాండ్ ఆవరణలోనే నిలుస్తున్నది.

### మంత్రి దృష్టి సారించాలి

హుస్నాబాద్ బస్టాండ్ ఆధునీకరణ పనులకు గతేడాది మార్చి 8న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ ఏడాది జనవరి 23న ప్రారంభోత్సవం చేశారు. దాదాపు రూ.2.50 కోట్ల నిధులు ఆధునీకరణకు వెచ్చించడంపై ప్రజల్లో హర్షం వ్యక్త అయ్యింది. కానీ, పనుల్లో నాణత్య కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాక్షాత్తు రవాణా శాఖ మంత్రి ఇలాకాలోనే చేసిన పనులకు లీకేజీలు, అస్తవ్యస్తంగా ఉండటం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మంత్రిపొన్నం ప్రభాకర్‌గౌడ్ బస్టాండ్ ఆధునీకరణ పనులపై సమీక్ష నిర్వహించి, ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ఇటీవల ఆధునీకరించిన హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్